క్లుప్తంగా

ప్రసాదంపాడుకు చేరుకున్న రథోత్సవం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న గ్రామోత్సవం శుక్రవారం ప్రసాదంపాడుకు ప్రవేశించింది. గత నాలుగు రోజులుగా రామవరప్పాడులోని పురవీధుల్లో, కాల్వగట్టు ప్రాంతాల్లో అమ్మవారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు ఉత్సవ వాహనాన్ని అనుసరిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. రామవరప్పాడులో పూర్తయిన గ్రామోత్సవం సాయంత్రం 6 గంటలకు ప్రసాదంపాడుకు చేరుకుంది. ప్రసాదంపాడులోని పుర వీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇరు గ్రామాల్లో గ్రామోత్సవం పూర్తి చేసుకున్న తర్వాత శనివారం ఆలయ సమీపంలోని రైవస్ కాలువలో తెప్పోత్సవం, రాత్రి రావి చెట్టు ఎదుట పూలంగి (ఊయల) సేవను నిర్వహించనున్నారు.

రేపు నున్నలో ఉచిత యోగా శిక్షణ ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గీతామందిరంలో ఈ నెల 19వ తేదీన ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం నుంచి ప్రతి రోజూ ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు 28 రోజుల పాటు క్లాసులు నిర్వహించనున్నారు. మహిళలు, పురుషులు పాల్గొనవచ్చు.

పీఎంఏవై పథకంలో 600 ఇళ్లు మంజూరు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీకి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) అర్బన్ 2.0 పథకం కింద 600 గృహాలు మంజూరు అయ్యాయని కమిషనర్ పి.భవాని ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి స్థలం ఉండి గృహం లేనివారికి గృహం కట్టుకోవటానికి యూనిట్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి గృహానికి రూ.2.40 లక్షలు చొప్పున ప్రభుత్వం నిధులు అందజేస్తుందని తెలిపారు. వచ్చే ఏప్రిల్‌లో గృహాలు మంజూరు అవుతాయని పేర్కొన్నారు. ఒక్కో లబ్ధిదారుడికి ఒక్కో గృహం మాత్రమే మంజూరు చేస్తారని, రెండు గృహాలు కలిపి కట్టుకునే విధానం లేదని తెలిపారు. అర్హులైన వారు భార్య,భర్త ఇద్దరి ఆధార్, ఇద్దరి బ్యాంకు ఖాతా వివరాలు, స్థలం కాగితాలు, రేషన్‌కార్డుతో ఆయా సచివాలయాల్లో కాని, హౌసింగ్ ఏఈకి గాని దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

గన్నవరం: చోరీ కేసులో నిందితుడికి మూడు నెలలు జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ గన్నవరం 8వ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. వివరాలిలా ఉన్నాయి. గతేడాది సెప్టెంబర్ 14వ తేదీ రాత్రి స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో తాళం వేసి ఉన్న మాస్టర్ పెయింట్ షాపులో చోరీ జరిగింది. కౌంటర్‌లోని రూ. 5,090 నగదును అపహరించుకుపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు నిందితుడిది కైకలూరు మండలం ఆటపాకకు చెందిన ఆరేపల్లి దుర్గారావుగా గుర్తించారు. ఈ కేసు విచారణలో నేరం రుజువు కావడంతో దుర్గారావుకు కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో నెల రోజులు జైలుశిక్షను అమలు చేయాలని తీర్పు ఉత్తర్వుల్లో జడ్జి పేర్కొన్నారు.

సీఐడీ ఎదుట లొంగిపోయిన ఆరుగురు

గన్నవరం: గన్నవరంలోని టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో నిందితులుగా ఉన్న ఆరుగురు శుక్రవారం సీఐడీ అధికారులు వద్ద లొంగిపోయారు. సుమారు రెండేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనపై నమోదైన కేసులో ఇప్పటి వరకు పోలీసులు సుమారు 94 మందిని నిందితులుగా చేర్చారు. వీరిలో 47 మంది వరకు ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను ఇటీవల హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో నిందితులైన వింత ఆదినారాయణరెడ్డి, సగ్గుర్తి నాగదీపు, దుర్గారావు, కోటేశ్వరరావు, గద్దె సుధీర్, కమలాకరరావు సీఐడీ అధికారుల ఎదుట లొంగిపోయారు. వీరిని సీఐడీ అధికారులు మంగళగిరిలోని ఆఫీస్‌లో విచారణ చేస్తున్నట్లు సమాచారం. వీరిని శనివారం విజయవాడ కోర్టులో హాజరుపరిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వీరి అరెస్ట్‌ను మాత్రం సీఐడీ అధికారికంగా ధ్రువీకరించలేదు.

చెరువు ఆక్రమణకు స్కెచ్

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం పేరుతో చెరువుపై కన్ను
- బోర్డు తీర్మానం చేయాలంటూ పంచాయతీకి లెటర్ అందించిన తహసీల్దార్
- పంచాయతీ తీర్మానం కోసం ఒత్తిడి
- గతంలో చెరువులో నుంచి రోడ్డు
- టీడీపీ నాయకుల ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు



కుంటగా పిలువబడే ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న చెరువు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న చెరువు స్థలంపై టీడీపీ నాయకుల కన్ను పడింది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం పేరుతో కోట్లు విలువజేసే స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. సర్వే నంబరు 190/1లో సుమారు 2.26 ఎకరాల విస్తీర్ణం గల కుంటగా పిలువబడే చెరువు ఉంది. ఈ చెరువు జాతీయ రహదారికి అతి సమీపంలో ఉండటంతో దీని విలువ కోట్లు పలుకుతోంది. ఈ చెరువు ఎప్పటి నుంచో నిరుపయోగంగా మారడంతో ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు గతంలో టీడీపీ నాయకులే ఎన్నో ప్రయత్నాలు చేశారు. ప్రస్తుతం గన్నవరం నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం కోసం స్థలం అన్వేషిస్తున్నారు. ఇందు కోసం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అనువైన స్థలం కోసం టీడీపీ నాయకులకు సూచించారు. ఇదే అదునుగా భావించిన ఎనికేపాడు నాయకులు ఈ చెరువు స్థలాన్ని వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. అనుకున్నదే తడవుగా చెరువు స్థలాన్ని ఆక్రమించడానికి అనువైన పావులు కదుపుతున్నారు. ఇందు కోసం పంచాయతీ తీర్మానానికి మెజార్టీ పాలకవర్గ సభ్యుల ఆమోదం నిమిత్తం ఒత్తిడి తీసుకొస్తున్నారు. అదే విధంగా మండల అధికారులను సైతం చెరువు స్థలం పూర్తి వివరాలు అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో తాజాగా గ్రామ వీఆర్వో సత్యవతి చెరువు వివరాల పూర్తి నివేదికను మండల రెవెన్యూ అధికారులకు అందజేశారు. దీంతో పంచాయతీ బోర్డు తీర్మానంలో పెట్టాలంటూ తహసీల్దార్ సుగుణ పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌కు లెటర్ అందజేశారు.

రాత్రికి రాత్రే రోడ్డు

వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి కొన్నేళ్ల క్రితం రాత్రికి రాత్రి ఈ చెరువులో నుంచి టీడీపీ నాయకులు రోడ్డు వేశారు. ఈ చెరువును ఆనుకుని పదుల విస్తీర్ణంలో పొలాలు ఉన్నాయి. ఈ పొలాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందన్న సాకును చూపి అప్పట్లో అనధికారికంగా రోడ్డు వేశారు. జాతీయ రహదారికి అతి సమీపంలో ఈ పొలాలు చాలా వరకు టీడీపీకు చెందిన నాయకులవే ఉండటం గమనార్హం. పొలాల్లోకి రోడ్డు పడటంతో లక్షల్లో ఉన్న పొలాలు కోట్లకు పడగలెత్తాయి. ప్రస్తుతం ఇదే కోవలో తమ పొలాలకు మరింత లబ్ధి చేకూర్చుకునేందుకు ఏకంగా చెరువు స్థలాన్నే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పేరుతో ఆక్రమణకు సిద్ధమయ్యారు. దీని నిర్మాణమే జరిగితే సరాసరి వీరి పొలాలకు వెళ్లడానికి అనువైన రోడ్డు ఏర్పడుతుంది. పైగా అమాంతం పొలాల ధరలు కూడా చుక్కలను అంటుతాయి. టీడీపీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలు బయటకు పొక్కడంతో గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ సెంటర్ నిర్మాణానికికి అనువైన ప్రభుత్వ స్థలాలు ఎన్నో ఉన్నాయని వీటిని కాదని చెరువును కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరిస్తున్నారు.



గతంలో చెరువును ఆక్రమించి వేసిన రోడ్డు

గత ప్రభుత్వంలో అభివృద్ధి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ చెరువును అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అభివృద్ధి చేశారు. గ్రామంలోని మురుగుతో నిండి ఉన్న చెరువును ప్రక్షాళన చేశారు. చెరువు మొత్తం పూడికతీత పనులు పూర్తి చేశారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పార్క్ ఏర్పాటు చేయాలని ప్రయాళికలు రూపొందించారు. ఇందు కోసం నిధులు కూడా మంజూరయ్యాయి. కాగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం చెరువును అభివృద్ధి చేయకపోయినా ఫర్వాలేదు గానీ ఆక్రమించకూడదని గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చుతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం పేరుతో చెరువును ఆక్రమించి పూడ్చితే చూస్తూ ఊరుకోబోమని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పునరాలోచించి ప్రయత్నాలు విరమించుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాల మేరకు లెటర్ అందజేశాం

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచన మేరకు లెటర్‌ను పంచాయతీ కార్యదర్శికి అందించాం. ఇరిగేషన్‌కు చెందిన చెరువు స్థలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి ఎమ్మెల్యే నుంచి ప్రతిపాదనలు అందాయి. దీంతో గ్రామ రెవెన్యూ అధికారులతో చెరువు పరిశీలించి నివేదిక తయారు చేయించాం.

– బి. సుగుణ, తహసీల్దార్

త్వరలో సమావేశం నిర్వహిస్తాం

ఉన్నతాధికారుల ఆదేశాల నిమిత్తం చెరువు స్థలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం నిమిత్తం పంచాయతీ బోర్డు తీర్మానానికి త్వరలో సమావేశం నిర్వహిస్తాం. దీని నిమిత్తం తహసీల్దార్ కార్యాలయం నుంచి కూడా లెటర్ అందింది.

– విద్యాధర్, పంచాయతీ కార్యదర్శి

అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న నాయకులు

వాల్టా చట్టాన్ని అనుసరించి చెరువును పూడ్చటం చట్టరీత్యా నేరం. దీంతో ఈ చెరువు నిరుపయోగంగా మారిందని చూపుతూ నాయకులు అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. తొలుత పంచాయతీ బోర్డుతో తీర్మానం చేయించి, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో ఎన్‌ఓసి ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. చెరువు స్థలంలో నిర్మాణం జరగాలంటే తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ అనుమతులు పొందాలి. ఈ అనుమతులు పొందేందుకు చెరువు స్థలం నుంచి ప్రభుత్వ స్థలంగా మార్పించేందుకు అవసరమైన పావులు కదుపుతున్నారు. సీసీఎల్‌ఏ (భూ పరిపాలన ప్రధాన కమిషనర్)ను కూడా తప్పు దోవ పట్టించడానికి అవసరమైన చర్యలను కూడా ప్రారంభించడంతో దీని వెనుక ఎంత మంది పెద్దలు ఉన్నారో అర్థమవుతుంది.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



గన్నవరం: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని కేసరపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం తోట నరేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల్లో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ జగ్గయ్యపేటలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాల్లో ఏడో తరగతి విద్యార్థి బి.అశ్విన్‌బాబు, 9వ తరగతి విద్యార్థిని పి.శ్రావణ లక్ష్మి ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. వీరి ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు ఛత్తీస్‌గఢ్‌లో ఈ నెల 19 నుంచి 22 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన ఇద్దరు విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎన్. శ్రీదేవిని హెచ్‌ఎంతో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఉపాధ్యాయులు అభినందించారు.

నేత్రదానం



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన సుంకర భాస్కరరావు మరణాంతరం నేత్రదానం చేశారు. భాస్కరరావు (84) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. దీంతో ఆయన కోరిక మేరకు నేత్రదానం చేసేందుకు కుమారుడు సాంబశివరావు, ఇతర కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి (విజయవాడ)ను సంప్రదించి రెండు నేత్రాలను దానం చేశారు. కుటుంబ సభ్యుల సమ్మతితో భాస్కరరావు భౌతికకాయం నుంచి వైద్యులు రెండు నేత్రాలను సేకరించారు.

నవోదయ ప్రవేశ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ, ఎగ్జామ్ ఆఫీసర్

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూల్స్‌లో ఏర్పాటు చేసిన నవోదయ ప్రవేశ పరీక్ష కేంద్రాలను శుక్రవారం విద్యాశాఖ అధికారులు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో బల్లలు, కుర్చీలు, లైట్లు, ఫ్యాన్లు వంటి సదుపాయలను ఎంఈఓ కొండా రవికుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం జరగనున్న నవోదయ ప్రవేశ పరీక్షకు ఆరు మండలాలకు చెందిన 551 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. జెడ్పీ బాలుర హై స్కూల్లో 263 మంది, బాలికల హైస్కూల్లో 288 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణాధికారులు రవిబాబు, ఝాన్సీ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



అధ్యాపకుడు ఫణికి డాక్టరేట్ అందజేస్తున్న కళాశాల సెక్రటరీ సత్యనారాయణరెడ్డి

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్లో అధ్యాపకుడిగా పనిచేస్తున్న పీవీఎల్ఎన్ ఫణికి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో చెన్నై అన్నామలై యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లోని 'అంటీనాస్ అండ్ మైక్రోవేవ్ విభాగంలో డిజైన్ అండ్ పెర్ఫార్మన్స్ ఎనాలసిస్ ఆఫ్ మైక్రో స్ట్రిప్ వైడ్ బ్యాండ్ అంటీనస్ ఫర్ బ్రెస్ట్ హ్యూమర్ డిటెక్షన్ అప్లికేషన్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేశారు. ఈ డాక్టరేట్‌ను శుక్రవారం కళాశాల్లో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి అధ్యాపకుడు ఫణికి అందజేశారు. కళాశాల అధ్యాపకులు డాక్టరేట్ సాధించిన ఫణిని అభినందించారు.

ఇద్దరు వ్యక్తులపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: కానూరులో ఇద్దరు వ్యక్తులపై పలువురు దాడి చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు కానూరు మురళీనగర్‌కు చెందిన ద్రోణాదుల నాగసాయి అనంతపురంలో మైనింగ్ కంపెనీలో పని చేస్తాడు. సంక్రాంతి సందర్భంగా అతను కానూరు మురళీనగర్ ఇంటికి వచ్చాడు. అయితే నాగసాయి, అతని మిత్రుడు బి.చిరంజీవి కలిసి మురళీనగర్‌లో ఉంటున్న బాబాయి సత్తిబాబు ఇంటికి బయలుదేరారు. అక్కడే పండు, దుర్గాప్రాద్, ఇమ్రాన్ అనే వ్యక్తులు మద్యం తాగుతూ నాగసాయిని ఆపారు. గతంలో ఒక యువతి అదృశ్యమయిన కేసులో వివరాలు తెలిస్తే చెప్పాలన్నారు. దీనికి నాగసాయి తనకు తెలియదని వెళ్లిపోతుండగా నాగసాయి, అతడి మిత్రుడు చిరంజీవిపై రాళ్లతో పై వ్యక్తులు దాడి చేశారు. ఇంటి వద్ద ఉన్న నాగసాయి కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బిర్యానీ విక్రయిస్తున్న వారిపై దాడి

పెనమలూరు: యనమలకుదురు కోడిపందేల వద్ద బిర్యానీ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పలువురు దాడి చేసిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు జక్కుల సుబ్బారావు అనే వ్యక్తి యనమలకుదురు కోడి పందేల శిబిరం వద్ద బిర్యానీ స్టాల్ పెట్టాడు. అతడి సోదరుడు జక్కుల శ్రీనివాసరావు, అతడి కుమారుడు విష్ణువర్ధన్ స్టాల్ వద్ద బిర్యానీ విక్రయిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు టోకెన్లు తీసుకుని బిర్యానీ కోసం వచ్చారు. వారికి శ్రీనివాసరావు బిర్యానీ వడ్డిస్తుండగా వచ్చిన వ్యక్తులు చికెన్ గిన్ని లాక్కున్నారు. ఎందుకు అలా చేస్తున్నారని శ్రీనివాసరావు అభ్యంతరం తెలపటంతో వచ్చిన వ్యక్తులు శ్రీనివాసరావుపై దాడి చేశారు. అడ్డుకోబోయిన విష్ణువర్ధన్‌పై కూడా దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన పై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

కంకిపాడు: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఈడుపుగల్లు పశువైద్యాధికారి డాక్టర్ కర్నాటి మాధవరావు తెలిపారు. 20వ తేదీన ప్రొద్దుటూరు, ఉప్పలూరు, 21న తెన్నేరు, దావులూరు, 22న కందలంపాడు, వేల్పూరు, 23న నెప్పల్లి, గొడవర్రు, 24న మారేడుమాక, మంతెన, 25న కోలవెన్ను, గొల్లగూడెం, 27న జగన్నాథపురం, పునాదిపాడు, 28న చలివేంద్రపాలెం, కాసరనేనివారిపాలెం, 29న కుందేరు, 30న కంకిపాడు, మద్దూరు, 31న ఈడుపుగల్లు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. పశుపోషణపై అవగాహనా సదస్సులు, నట్టల నివారణ కార్యక్రమం, పశు బీమా పథకం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ రెండు గ్రామాల్లో రెండు పశువైద్య బృందాలు సేవలు అందిస్తాయని పేర్కొన్నారు. తనతో పాటుగా పశువైద్యాధికారులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ రంగారావుతో కూడిన బృందాలు సేవలు అందిస్తాయని తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



ప్రసంగిస్తున్న ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు



ట్రాఫిక్ వాలంటరింగ్ టీమ్‌తో అధికారులు

పెనమలూరు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, విజయవాడ ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అర్బన్ ట్రాఫిక్ వాలంటరింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. వాహనదారులు అతివేగంగా వాహనాలు నడపటం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్టు వంటి భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణగౌడ్, ఉదయ్‌శివప్రసాద్, నెహ్రూ యువకేంద్రం అధికారి సుంకర రాము, సీఐ వెంకటనారాయణ, ప్రో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ రవిచంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, కె.త్రిమూర్తులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

ఉంగుటూరు: మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీడీఓ సత్యకుమార్ పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రదేశాల్లో జంగిల్ క్లియరెన్స్, పారిశుద్ధ్య పనులు, మొక్కలు నాటడం చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెత్త తరలింపు పేరుతో దోపిడీకి యత్నం



కోనాయి చెరువు వద్ద చెత్త నిల్వలు

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్పల తరలింపు పేరుతో మరోసారి దోపిడీకి ప్రజాప్రతినిధులు, అధికారులు తెరతీశారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన నేపథ్యంలో హడవుడిగా చెత్త కుప్పలను తరలించేందుకు శుక్రవారం గ్రామ పంచాయతీ పాలకవర్గం అత్యవసర సమావేశం నిర్వహించారు. చెత్త తరలింపు పనుల అంచనా విలువను నెలల వ్యవధిలోనే అమాంతంగా పెంచేసి తమ అనుయాయుడికి కాంట్రాక్ట్‌ను అప్పగిస్తూ పరిపాలన ఆమోదం తెలిపారు. ఏకపక్షంగా చెత్త తరలింపు పనులు కేటాయింపుపై ఇతర పాలకవర్గ సభ్యులు, ఓ ఎంపీటీసీ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అధికారులు, కీలక ప్రజాప్రతినిధులు పరిగణనలోకి తీసుకోలేదు. వివరాలిలా ఉన్నాయి. మూడు నెలలు క్రితం కోనాయి చెరువు వద్ద చెత్త నిల్వలను బయటకు తరలించేందుకు రూ. 11.40 లక్షలకు పాలకవర్గం ఆమోదం తెలిపినప్పటికీ అనివార్య కారణాలతో పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా కొండపావులూరు పర్యటన నేపథ్యంలో చెత్త తరలింపు కోసం శుక్రవారం ఎమర్జెన్సీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ లేకుండానే ఉపసర్పంచ్ పాలడుగు నాని నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఇక్కడి చెత్తను 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపావులూరు క్వారీ గోతుల్లో పోసేందుకు రూ. 15 లక్షల అంచనాతో పనులను పాతగన్నవరానికి చెందిన కాంట్రాక్టర్‌కు కేటాయించారు. అయితే మూడు నెలల వ్యవధిలోనే అంచనాలను ఏకంగా రూ.3.60 లక్షలు పెంచడంపై పాలకవర్గ సభ్యులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇదే తరహాలో చెత్త తరలింపు పేరుతో గ్రామ పంచాయతీ నిధులు స్వాహా చేశారని గుర్తుచేస్తున్నారు. అసలు కేంద్ర మంత్రి అమిత్‌షా రూట్ మ్యాప్‌లో గన్నవరం-ఆగిరిపల్లి రోడ్డు లేకపోయినప్పటికీ హడావుడిగా చెత్త తరలింపు పనులు కేటాయింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పనుల కేటాయింపుపై పలువురు వార్డు సభ్యులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

ఎరువులు తక్కువ మోతాదులో వాడాలి

పెనమలూరు: పంటలకు రైతులు ఎరువులు తక్కువ మోతాదులో వాడి దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ పేర్కొన్నారు. ఆమె శుక్రవారం చోడవరం, పెనమలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. మినుము పంటలో ఎరువులు అధికంగా రైతులు వాడుతున్నట్లు గుర్తించామన్నారు. ఇలా ఎరువులు వాడితే మొక్క భౌతిక స్వరూపం మారిపోతుందన్నారు. మొక్క ఎదుగుదల తగ్గిపోతుందన్నారు. మొక్క ఆకులు ముదురు రంగులో మారి దిగుబడులు తగ్గి పోతాయని తెలిపారు. మొక్క జొన్న పంటకు కాండం కుళ్లు తెగులు ఆశిస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీఏఏలు వంశీ, అనూష పాల్గొన్నారు.

20 నుంచి ఉచిత దంత వైద్య శిబిరం

గన్నవరం: మండలంలోని చిన్నఅవుటపల్లిలో ఉన్న డాక్టర్ సుధా, నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల్లో జాతీయ కట్టుడు పళ్ల విభాగం వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ. రామోజీరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో తీసి పెట్టుకునే పూర్తి పళ్ల సెట్లు, పాక్షిక పళ్ల సెట్ల ఏర్పాటు చేసే సేవలను అందించనున్నట్లు పేర్కొన్నారు.

గోసాలలో రోడ్డుపై మరో రోడ్డు నిర్మాణం



గతంలో ఉన్న సీసీ రోడ్డు



సీసీ రోడ్డు పై మళ్లీ వేసేందుకు చేస్తున్న పనులు

పెనమలూరు: కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ పథకం కోసం వచ్చిన నిధులతో ఏమి పనులు చేయాలో తెలియక ఉన్న రోడ్ల పైనే మళ్లీ రోడ్డు వేస్తున్నారు. గోసాల నెహ్రూనగర్ 8వ వార్డులో గతంలో సిమెంట్ రోడ్డు ఉంది. ఈ రోడ్డులో గుంతలేమీలేవు. ఈ రోడ్డు పైనే మరో సిమెంట్ రోడ్డు వేసేందుకు పనులు చేపట్టారు. డ్రెయినేజీ, సీసీ రోడ్డు పనులు చేస్తున్నారు. దీంతో నెహ్రూనగర్ వాసులు ముక్కున వేలేసుకున్నారు.